క్లుప్తంగా

సున్నిత హాస్యానికి చిరునామా కోట



విజయవాడ కల్చరల్: సున్నిత హాస్యానికి చిరునామా కోట శ్రీనివాసరావు అని శ్రీ కళా భారతి వ్యవస్థాపకుడు శింగంశెట్టి చంద్రశేఖర్ అన్నారు. సాంస్కృతిక కళా సంస్థల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని సంస్థ కార్యాలయంలో సినీ నటుడు కోట శ్రీనివాసరావు సంస్మరణ సభను నిర్వహించారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ ఆయన నటించిన ప్రతిఘటన, అహ నా పెళ్లంట తదితర సినిమాలు చిరస్థాయిగా నిలచిపోతాయన్నారు. కామ్రేడ్ జీఆర్‌కే పోలవరపు సాహితీ సమితి వ్యవస్థాపకుడు గోళ్ళ నారాయణరావు, వివిధ సాహితీ సంస్థల ప్రతినిధులు చింతకాయల చిట్టిబాబు, కె.డేవిడ్‌రాజు, పరుచూరి విజయలక్ష్మి, బోడి ఆంజనేయరాజు, బి.వీరభద్రరావు కోట నటనా వైదుష్యాన్ని కొనియాడారు. తొలుత కోట శ్రీనివాసరావుతో పాటు నటి బి.సరోజకు మృతికి నివాళులర్పించారు.

సేవా గుణం అలవాటు చేసుకోవాలి



విజయవాడకల్చరల్: సాంస్కృతిక, కళా సంస్థలు సేవా గుణం అలవాటు చేసుకోవాలని శ్రీ కృష్ణదేవరాయ విగ్రహ కమిటీ, సాంస్కృతిక సేవా సంస్థ వ్యవస్థాపకుడు శీలం నాగేశ్వరరావు అన్నారు. విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం బీఆర్‌టీఎస్ రోడ్డులోని విగ్రహం వద్ద అన్నార్తులకు అన్నదానం, బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 360 రోజులు 24 గంటలపాటు చలివేంద్రం నిర్వహిస్తునట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు బి.రామకృష్ణ, కామిశెట్టి దుర్గారావు, రాజారావు పాల్గొన్నారు.

పేద ముస్లింలకు అండగా ఉండాలి



పాయకాపురం(విజయవాడరూరల్): ఆజాద్ ముస్లిం కమిటీలో కొత్తగా నియమితులైన వారు సాటి పేద ముస్లింలకు అండగా ఉండాలని ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా అన్నారు. మంగళవారం 64వ డివిజన్ కండ్రిక కార్యాలయంలో కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా విజయవాడ నగర యూత్ ఉపాధ్యక్షులుగా షేక్ షహెన్షా, షేక్ బాజీ(అబ్దుల్లా)లను నియమించి నియామక పత్రాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కమిటీలో నియమితులైన ప్రతి ఒక్కరూ కమిటీ చేస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని తెలియజేశారు. నియోజకవర్గాల వారీగా కమిటీ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుందని, ఆ కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో నగర యూత్ అధ్యక్షుడు షేక్ నాగూర్, 61వ డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎండీ రఫీ తదితరులు పాల్గొన్నారు.

నాగమానసాదేవి ఆలయంలో ఆషాఢ మాసోత్సవాలు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): లెనిన్ సెంటర్ లోని ఓం శ్రీషిర్డి నాగసాయిబాబా, నాగమానసాదేవి అమ్మవారి మందిరంలో మంగళవారం ఆషాఢ మాసోత్సవాలు వైభవంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా నాగమానసాదేవి అమ్మవారిని నయన మనోహరంగా వివిధ రకాల కూరగాయలతో అలంకరించారు. మహిళలు అమ్మవారికి సారెను సమర్పించారు. శాకంబరీదేవి అలంకారంలో కొలువైన నాగమానసాదేవి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు సుధాస్వామి ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ జరిగింది.

18న నీతిఆయోగ్ సభ్యుడు అరవింద్ విర్మానీతో ముఖాముఖి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గాంధీనగర్‌లోని చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ కార్యాలయంలో ఈనెల 18వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటలకు నీతి ఆయోగ్ గౌరవ సభ్యుడు డాక్టర్ అరవింద్ విర్మానీతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు గద్దం బాల వెంకట రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ అరవింద్ విర్మానీ బిజినెస్, ఎక్స్‌పోర్ట్, అంతర్జాతీయ వ్యాపారం, మాన్యుఫాక్చరింగ్, అర్బన్ అండ్ రీజనల్ డెవలప్‌మెంట్ తదితర అంశాలపై ప్రసంగిస్తారన్నారు. వ్యాపార వాణిజ్య వర్గాలు, పారిశ్రామికవేత్తలు ముఖాముఖిలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని రవికుమార్ కోరారు.

ఆందోళన చేస్తున్న మున్సిపల్ కార్మికుల అరెస్ట్

- సమస్యల పరిష్కారం కోరుతూ చలో విజయవాడ పిలుపు
- రాష్ట్ర వ్యాప్తంగా తరలివచ్చిన మున్సిపల్ కార్మికులు



ఏఐటీయూసీ ఆధ్వర్యంలో విజయవాడ గాంధీనగర్ లోని ధర్నాచౌక్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న ఏపీ మున్సిపల్ వర్కర్స్



ధర్నా చౌక్ వద్ద మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ ఇంజినీరింగ్, పారిశుద్ధ్య కార్మికులు చలో విజయవాడ కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల వేతనాలు పెంచాలని, సంక్షేమ పథకాలను కోత లేకుండా అందివ్వాలని, పెండింగ్‌లో ఉన్న 6 డీఏలు సరెండర్ లీవుల ఎన్‌క్యాష్‌మెంట్, గ్రాట్యుటీ ప్రభుత్వం చెల్లించాలని యూనియన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. చలో విజయవాడలో భాగంగా విజయవాడ అలంకార్ సెంటర్‌లోని ధర్నా చౌక్ వద్ద ధర్నా నిర్వహించారు. తమ డిమాండ్లు పరిష్కరించాలని నినాదాలు చేశారు. అధికారులకు వినతిపత్రం అందించేందుకు ధర్నా చౌక్ నుంచి బయలు దేరిన మున్సిపల్ కార్మికులను పోలీసులు అరెస్ట్ చేశారు. వాహనాల్లో బలవంతంగా ఎక్కించి పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోరుమామిళ్ల సుబ్బరాయుడు, ఏఐటీయూసీ రాష్ట్ర డెప్యూటీ జనరల్ సెక్రటరీ వెంకటసుబ్బయ్య, కార్యదర్శి రాజేష్ గౌడ్, రాష్ట్ర సమితి సభ్యులు కళ్యాణి అప్పలరాజు, ముబారక్, ఇంద్రాణి, చలపతి నాయుడు తదితరులను అరెస్ట్ చేసి సత్యనారాయణపురం పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సుబ్బరాయుడు మాట్లాడుతూ అక్రమ అరెస్టులను ఖండించారు. ఏడాది కాలంగా మునిసిపల్ కార్మికులు తమ సమస్యలు మొరపెట్టుకుంటున్నా ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. సమస్యలు పరిష్కరిస్తామంటూ ప్రకటనలకే పరిమితమయ్యారన్నారు. సంక్షేమ పథకాలు అందడం లేదన్నారు. విద్యార్థుల చదువుకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వచ్చే వీలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. మున్సిపల్ కార్మికుల కుటుంబాలలో ఉన్న వారంతా సంక్షేమ పథకాలను కోల్పోయి అవస్థలు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. చలో విజయవాడ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్, డెప్యూటీ జనరల్ సెక్రటరీ వెంకటసుబ్బయ్య, రాష్ట్ర అధ్యక్షుడు ఆసుల రంగనాయకులు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ కె.మల్లేశ్వరరావు, ఉపాధ్యక్షుడు కోట మాల్యాద్రి, కోశాధికారి తాడికొండ వాసు, చలం, నాసర్ వలి, దుర్గమ్మ, అంకయ్య, ఇంద్రాణి, నగర కార్యదర్శి బుద్దె రాజా, అధ్యక్షుడు చలం, సహాయ కార్యదర్శి తుపాకుల ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం విద్యుత్ సబ్ స్టేషన్ 11కేవీ దాసాంజనేయ ఫీడర్ పరిధిలో విద్యుత్ వైర్లు మరమ్మతుల దృష్ట్యా బుధవారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీరు పి.రవీంద్రబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మాచవరం బీఆర్టీఎస్ రోడ్డు, క్యాన్సర్ హాస్పిటల్ ఏరియా, నార్ల వారి వీధి, కుటుంబరావు వీధి, బుల్లెమ్మ వీధి, కాటూరి వారి వీధి, దానయ్య వీధి, పోతినేని వారి వీధి, అక్కుళ్ల తాతయ్య వీధి, దుగ్గిరాల బలరామకృష్ణయ్య వీధి, మాచవరం రైవస్ కాలువ కట్ట ఏరియా, పడవలరేవు బీఆర్టీఎస్ రోడ్డు నుంచి మాచవరం దాసాంజనేయ స్వామి గుడి మధ్య ఉన్న ఏలూరు రోడ్డు వైపు తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు తమ సిబ్బందికి సహకరించాల్సిందిగా ఆయన కోరారు.

బిగించేది స్మార్ట్ మీటర్లు కాదు.. ప్రజల మెడకు ఉరి

- సీపీఎం సెంట్రల్ సిటీ కార్యదర్శి బి.రమణారావు
- విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ సింగ్‌నగర్‌లో సీపీఎం ధర్నా



విద్యుత్ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సింగ్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల రూపంలో ప్రజల మెడలకు ఉరితాడులను బిగిస్తోందని సీపీఎం సెంట్రల్ సిటీ కార్యదర్శి బి.రమణారావు ఎద్దేవా చేశారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో సింగ్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. దీనిలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ వత్తిళ్లతో అధికారులు ప్రతి గృహంలో అదానీ విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించే ప్రయత్నం చేస్తున్నారని, ప్రజలపై పెనుభారంగా మారుతున్న ఈ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వెంటనే మానుకోవాలని హెచ్చరించారు. నగరంలో ప్రజలు స్వచ్ఛందంగా బయటకు వచ్చి స్మార్ట్ మీటర్లు మాకొద్దు మహాప్రభో అని మొత్తుకుంటున్నా ఈ ప్రభుత్వ పెద్దల చెవికి వినిపించకపోవడం, కళ్లకు కనిపించకపోవడం బాధాకరమన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను తుంగలో తొక్కుతుందని, విద్యుత్ విషయంలో ఈ ప్రభుత్వం మాట తప్పిందన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లను పగలకొట్టాలని చెప్పిన సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేష్ ఇప్పుడు ప్రతి ఇంటికి స్మార్ట్ మీటర్లు బిగించమని ఆదేశాలు ఇవ్వడం ఏమాత్రం సబబు కాదని హెచ్చరించారు. ప్రజలకు నమ్మక ద్రోహం చేస్తే సహించేది లేదని, ప్రజల మనోభావాలను పరిగణనలోకి తీసుకుని ఇళ్లకు బిగిస్తున్న స్మార్ట్ మీటర్లను వెంటనే నిలిపివేయాలని, లేని పక్షంలో ప్రజల ఆగ్రహానికి గురికావాల్సివస్తుందని హెచ్చరించారు. అనంతరం ట్రాన్స్‌కో అధికారులకు వినతిపత్రం అందజేశారు. సీపీఎం నాయకులు కె.దుర్గారావు, ఎస్‌కే నిజాముద్దీన్, పీర్‌సాహెబ్, దేవీకుమారి, విజయలక్ష్మి, విజయమ్మ, కాశమ్మ తదితరులు పాల్గొన్నారు.

కేఎల్ రావు సేవలు నిరుపమానం

మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు



కేఎల్‌రావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): కేంద్ర కేబినెట్‌లో జలవనరుల శాఖ, విద్యుత్ శాఖ మంత్రిగా పనిచేసి, ఫాదర్ ఆఫ్ ది ఇరిగేషన్ అండ్ ఎలక్ట్రిసిటీగా పేరొందిన పద్మభూషణ్ కేఎల్ రావు సేవలు నిరుపమానం అని మాజీ ఎమ్మెల్యే వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త మల్లాది విష్ణు కొనియాడారు. స్థానిక ఆంధ్రప్రభ కాలనీ జనహిత సదనంలో మంగళవారం సాయంత్రం కేఎల్ రావు జయంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా కేఎల్‌రావు చిత్రపటానికి విష్ణు పూల మాల వేసి నివాళులర్పించారు. విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి మూడుసార్లు పార్లమెంట్ సభ్యునిగా ఎన్నికై జవహర్‌లాల్ నెహ్రూ, లాల్ బహదూర్ శాస్త్రి, ఇందిరా గాంధీల మంత్రివర్గాలలో జలవనరుల శాఖ, విద్యుత్ శాఖ మంత్రిగా ఆయన అందించిన సేవలు ఎనలేనివని కొనియాడారు. కంకిపాడుకు చెందిన కేఎల్‌రావు దేశంలో పేరొందిన పద్మభూషణ్ అవార్డును అప్పటి ప్రధాని నెహ్రూ చేతుల మీదుగా అందుకున్నారన్నారు. 2006లో పులిచింతల ప్రాజెక్టు పూర్తయిన తర్వాత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి కేఎల్ రావు గౌరవార్థం ఆయన పేరిట కేఎల్ రావు పులిచింతల ప్రాజెక్టుగా నామకరణం చేశారని గుర్తుచేశారు. దేశవ్యాప్తంగా ఇరిగేషన్ రంగం ఇంత అభివృద్ధి చెందిందంటే అది కేఎల్ రావుతోనే సాధ్యమైందని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శర్వాణి మూర్తి, యర్రగొర్ల శ్రీరాములు, సుందర్ పాల్, దమ్మాలపాటి చంద్రశేఖర్, దోనేపూడి శ్రీనివాస్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న ఎన్టీఆర్ జిల్లా డీఈవో యూవీ సుబ్బారావు

పటమట(విజయవాడతూర్పు): ప్రధానోపాధ్యాయులు అందరూ నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని, పాఠశాల నిర్వహణ, గుణాత్మక బోధనపై మరింత అవగాహన పెంచుకోవాలని ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు అన్నారు. సమగ్ర శిక్షణ సంస్థ ఎన్టీఆర్ జిల్లా ఆధ్వర్యంలో పటమటలోని స్టెల్లా కళాశాలల్లో గెజిటెడ్ హెచ్ఎంలు, యూపీ హెచ్ఎంలు, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు జిల్లాస్థాయి స్కూల్ లీడర్‌షిప్ ట్రైనింగ్ జరిగింది. కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ లక్ష్యాన్ని సాధించాలని, విద్యార్థులు, ఉపాధ్యాయులతో సమన్వయంగా వ్యవహరించాలని అన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షణ ఎన్టీఆర్ జిల్లా ఏఎంవో ఎస్.అశోక్, ఏఏఎంవో సీహెచ్ శిరీషారాణి, కోర్సు ఇన్‌చార్జి, సెంట్రల్ ఎంఈవో ఆర్.విజయరావు, జిల్లాలోని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

చర్లపల్లి - తిరుపతి ప్రత్యేక రైలు పొడిగింపు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా వారంలో రెండు రోజులు చర్లపల్లి - తిరుపతి మధ్య నడిచే ప్రత్యేక రైళ్లను 2026 మార్చి వరకు పొడిగిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ప్రకటించారు. చర్లపల్లి - తిరుపతి(07017) ఆగస్టు 31 నుంచి వచ్చే ఏడాది మార్చి 29 వరకు ప్రతి ఆదివారం, తిరుపతి - చర్లపల్లి ప్రత్యేక రైలు (07018) సెప్టెంబర్ 1 నుంచి వచ్చే ఏడాది మార్చి 30 వరకు ప్రతి సోమవారం నడుస్తోంది. అదే విధంగా చర్లపల్లి - తిరుపతి(07251) సెప్టెంబర్ 3 నుంచి వచ్చే ఏడాది మార్చి 25 వరకు ప్రతి బుధవారం, తిరుపతి - చర్లపల్లి(07252) సెప్టెంబర్ 4 నుంచి వచ్చే ఏడాది మార్చి 26 వరకు ప్రతి గురువారం నడపనున్నారు.

దుర్గమ్మకు ఆషాఢం సారె

పటమట(విజయవాడతూర్పు): పటమట దర్శిపేటలో ఉన్న రాజరాజేశ్వరి, లలితా పరమేశ్వరి అమ్మవారి ఆలయం నుంచి ఇంద్రకీలాద్రిపై వేంచేసి ఉన్న దుర్గామల్లేశ్వర ఆలయంలో కనకదుర్గమ్మకు మంగళవారం ఆషాఢం సారెను అందించారు. ఆషాఢ మాసం పంచమి సందర్భంగా పటమట దర్శిపేటకు చెందిన 108 మంది ముత్తయిదువులు పసుపు, కుంకుమ, చీర, సారె, గాజులు, పూలు, పండ్లు, స్వీట్లు, పొంగళ్లతో పటమట పురవీధుల్లో మేళతాళాలతో కోలాహలంగా పాదయాత్రతో దుర్గగుడికి చేరుకుని అమ్మవారికి సారెను సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఆవుల నర్సయ్య, ప్రధానకార్యదర్శి పొత్తంశెట్టి నాగేశ్వరరావు, కోశాధికారి యామా శివన్నారాయణ, ఆకుల వీరయ్య, గోగినేని రాజేంద్రప్రసాద్ దంపతులు, రాజరాజేశ్వరి మహిళామండలి సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని నారాయణ పాఠశాల ఏజీఎం రమేష్ రెడ్డి సూచించారు. స్థానిక మారుతీనగర్‌లోని నారాయణ పాఠశాలలో మంగళవారం నూతనంగా ఎంపికైన స్టూడెంట్ కౌన్సిల్ సభ్యులకు బ్యాడ్జీలు అలంకరించి బాధ్యతలు అప్పగించారు. తొలుత విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి.

బంగారు కుటుంబాల దత్తత

- ముందుకు వచ్చిన మహానగర్ లయన్స్ క్లబ్, అమ్మా
- అభినందించిన కలెక్టర్ లక్ష్మీశ



కలెక్టర్‌కు ప్రతిజ్ఞా పత్రాలు అందజేస్తున్న లయన్స్, అమ్మా ప్రతినిధులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పేదరిక నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీ4 విధానంలో ఎంపిక చేసిన బంగారు కుటుంబాలను విజయవాడ మహానగర్ లయన్స్ క్లబ్, ఆంధ్రా మోటార్ మర్చంట్స్ అసోసియేషన్(అమ్మా) ముందుకు వచ్చాయి. పీ4 విధానం కింద బంగారు కుటుంబాలను దత్తత తీసుకుని, ఆ కుటుంబాల అభివృద్ధికి మార్గదర్శిగా వ్యవహరిస్తామని, సుసంపన్న, ఆరోగ్య, ఆనంద ఆంధ్ర సాకారానికి కృషి చేస్తామంటూ ప్రతిజ్ఞా పత్రాలను కలెక్టర్ లక్ష్మీశకు అందజేశాయి. మహానగర్ లయన్స్ క్లబ్, అమ్మా ప్రతినిధులు మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశను కలిశారు. మార్గదర్శిగా వ్యవహరిస్తామని ముందుకు వచ్చిన అమ్మా, లయన్స్ క్లబ్ ప్రతినిధులను కలెక్టర్ అభినందించారు. బంగారు కుటుంబాల అవసరాలకు అనుగుణంగా పిల్లలకు నాణ్యమైన విద్య, నైపుణ్యాభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాలు, వైద్య సేవలు తదితరాలకు మార్గదర్శులు మద్దతునిస్తారన్నారు. లయన్స్ క్లబ్ 245, అమ్మా 180 బంగారు కుటుంబాలను దత్తత తీసుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. పీ4 విధానం అమల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కలెక్టర్ లక్ష్మీశ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విజయవాడ మహానగర్ లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ వక్కలగడ్డ భాస్కరరావు, జోన్ చైర్‌పర్సన్ ఎస్‌వీ గుప్తా, కార్యదర్శి ఎల్.నాగబెనర్జీ, పాస్ట్ ప్రెసిడెంట్స్ ఐ.లక్ష్మణరావు, కందుల నాగేశ్వరరావు, ఆంధ్రా మోటార్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గారపాటి సతీష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి సుంకర చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు దోనేపూడి దుర్గాప్రసాద్, జీవీ సుబ్బారావు పాల్గొన్నారు.

ఎస్‌ఆర్‌ఆర్ కళాశాలలో మెగా ప్లాంటేషన్



ఎస్‌ఆర్‌ఆర్ ప్రభుత్వ కళాశాలలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యాన తపస్ ఫౌండేషన్ సహకారంతో మంగళవారం మెగా ప్లాంటేషన్ కార్యక్రమం జరిగింది. తపస్ ఫౌండేషన్ వారు అందజేసిన 100 మొక్కలను కళాశాల ప్రాంగణంలో విద్యార్థులతో నాటించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కనీసం రెండు మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. మొక్కలతోనే పెరిగిపోతున్న కాలుష్యాన్ని అదుపు చేయగలమని అన్నారు. తపస్ ఫౌండేషన్ అధ్యక్షుడు విపుల్ సింగ్ మాట్లాడుతూ తాము బజాజ్ ఫైనాన్స్ సౌజన్యంతో ఎస్‌ఆర్‌ఆర్ ప్రభుత్వ కళాశాలలో ప్లాంటేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కొల్లేటి రమేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్, ఫిజికల్ డైరెక్టర్ బి.యుగంధర్, కళాశాల అధ్యాపకులు, బజాజ్ ఫైనాన్స్ సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వలంటీర్‌లు పాల్గొన్నారు.

ఒకేషనల్ ఎడ్యుకేషన్‌తో ఉజ్వల భవిష్యత్తు

సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి శ్రీలత



ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో అతిథులు, ఉపాధ్యాయులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులంతా నైపుణ్య విద్యను బాగా అభ్యసించాలని, ఒకేషనల్ ఎడ్యుకేషన్‌లో ప్రావీణ్యం సంపాదిస్తే ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి శ్రీలత అన్నారు. ప్రపంచ యువజన నైపుణ్య దినోత్సవ కార్యక్రమం డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ సమగ్ర శిక్ష అండర్ ఒకేషనల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో సింగ్‌నగర్ ఎంకే బేగ్ హైస్కూల్ ప్రాంగణంలో మంగళవారం ఘనంగా జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ నైపుణ్య విద్యతో నేడు చక్కని అవకాశాలు ఉన్నాయని, దీని ద్వారా పోటీ ప్రపంచంలో అన్ని రంగాల్లో మనం ముందంజలో ఉంటామన్నారు. ఒకేషనల్ ఎడ్యుకేషన్ యొక్క ఉపయోగాలను విద్యార్థులంతా తప్పనిసరిగా తెలుసుకుని చక్కని ప్రయోజకులు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎలక్ట్రానిక్స్, ఐటీ విభాగానికి సంబంధించిన చిత్రలేఖన పోటీలు, క్విజ్ పోటీలలో విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. మండల విద్యాశాఖాధికారి బి.వెంకటేశ్వరరావు, స్కూల్ హెచ్ఎం మైనం హుస్సేన్, ఒకేషనల్ ట్రైనర్స్ ఎం.బాబు, లావణ్య, ఉష, రాజేష్ పాల్గొన్నారు.

మైనర్ డ్రైవింగ్‌పై తల్లిదండ్రులకు కౌన్సెలింగ్



మైనర్ డ్రైవింగ్‌కు పాల్పడిన తల్లికి కౌన్సెలింగ్ నిర్వహించి జరిమానా విధించిన సీఐ కిషోర్‌బాబు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): మైనర్ డ్రైవింగ్‌లో వారికి వాహనాలను అందించిన తల్లిదండ్రులపై నేరపూరిత చర్యలు తీసుకుంటామని మూడవ పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ కిషోర్‌బాబు హెచ్చరించారు. మంగళవారం వాహనం నడుపుతున్న మైనర్‌ను ట్రాఫిక్ పోలీసులు అడ్డుకుని వారి తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిచి కౌన్సెలింగ్ నిర్వహించారు. మోటారు వాహనాల చట్టం ప్రకారం రూ.6,035 జరిమానా కూడా విధించారు. ఈ సందర్భంగా కిషోర్‌బాబు మాట్లాడుతూ పిల్లలు కోరుకున్న వాటిని అందిస్తే ఆనందిస్తారని, అయితే ఆ సంతోషం విషాదంగా మారే అవకాశం ఉన్న సందర్భాల్లో తల్లిదండ్రులు కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని హెచ్చరించారు. తల్లిదండ్రులు ప్రోత్సహించడం వల్లే మైనర్లు రోడ్లపై స్నేహితులతో కలిసి స్నేక్ డ్రైవింగ్, రాష్ డ్రైవింగ్ చేస్తూ, లైసెన్స్ లేకుండా హానికర చర్యలకు పాల్పడుతున్నారన్నారు. ఏదైనా జరగరాని ప్రమాదం జరిగితే వారి ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలకూ ప్రమాదాన్ని కలిగిస్తుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 37 మందికి జరిమానా

లబ్బీపేట(విజయవాడతూర్పు): మద్యం తాగి వాహనాలు నడుపుతూ ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడిన 37 మందికి కోర్టు జరిమానాలు విధించింది. నగరంలోని ఐదవ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 37 మందిని గుర్తించి వారిని మంగళవారం ఆరవ అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి లెనిన్‌బాబు వారికి జరిమానాలు విధించారు. వారిలో 12 మందికి ఒక్కొక్కరికీ రూ.15వేలు చొప్పున మిగిలిన 25 మందికి ఒక్కొక్కరికీ రూ.10 వేలు చొప్పున జరిమానాలు విధించారు.

17న ఉన్నత విద్యా మండలి కార్యాలయం వద్ద ధర్నా

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాష్ట్రంలో డిగ్రీ అడ్మిషన్లు వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, ఏఐఎస్ఏ, పీడీఎస్ఓ, పీడీఎస్‌యూ సంఘాల రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో ఈ నెల 17న ఉన్నత విద్యా మండలి కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆయా విద్యార్థి సంఘాల నాయకులు పేర్కొన్నారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ భవన్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి కె.ప్రసన్నకుమార్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయికుమార్, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి రాజేష్ మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులు కావస్తున్నా ఇంకా డిగ్రీ కళాశాలల మొదటి సంవత్సరం ప్రవేశాల ప్రక్రియ మొదలు కాలేదన్నారు. దీనివలన ఇంటర్ పూర్తి చేసుకుని డిగ్రీ చేరాలనుకునే విద్యార్థులకు నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా సంవత్సరం లేటుగా ప్రారంభం కావడం వలన విద్యా సంవత్సరం మొత్తం ఆలస్యంగా నడుస్తుందన్నారు. వెంటనే డిగ్రీ మొదటి సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభించాలని, ఆన్‌లైన్‌లో కాకుండా ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు పి.రామ్మోహన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్ వెంకటేశ్వరరావు, నాయకులు కుమార్, స్వామి, పలు విద్యార్థి సంఘాల నాయకులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీసీ మహాసభను జయప్రదం చేయండి



భవానీపురం(విజయవాడపశ్చిమ): జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు లాకా వెంగళరావు యాదవ్ ఆధ్వర్యంలో ఈ నెల 17వతేదీ గురువారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించనున్న జాతీయ బీసీ మహాసభను జయప్రదం చేయాలని ఆసంఘం ఎన్టీఆర్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బుద్దా దివాకర్ కోరారు. తుమ్మలపల్లి కళాక్షేత్రం ఆవరణలోని జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద మంగళవారం మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బుద్దా దివాకర్ మాట్లాడుతూ చట్టసభలు, విద్య, ఉద్యోగ రంగాలతోపాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వంలో ఓబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, శాస్త్రీయబద్ధంగా లేని ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను రద్దు చేయాలన్నారు. మండల కమిషన్ సిఫారసులను పూర్తి స్థాయిలో అమలు చేయాలని వంటి డిమాండ్ల సాధన కోసం జరిగే మహాసభకు బీసీలు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం నగర అధ్యక్షులు శీరం నాగమల్లేశ్వరరావు, జిల్లా యూత్ అధ్యక్షులు దాసరి రామకృష్ణ, మహిళా అధ్యక్షురాలు బత్తుల గీత, వైద్య విభాగం అధ్యక్షులు డాక్టర్ మల్లికార్జునరావు, విజయవాడ నియోజకవర్గ అధ్యక్షులు దార్న చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.